సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 21.58 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 21.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ, కావలి కాలువలకు 3500 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,390
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,693
3శాతం జీఎస్టీతో	రూ.5,864
నవర (8గ్రా)	రూ.46,912

గరిష్టం/కనిష్టం 33.0 /24.2

వాతావరణం

బుధవారం గాలిలో తేమ 62 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. గురువారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, పార్టీకి తాను విధేయుడిగా ఉంటానని ఎంపీ చెప్పారు. జిల్లా రాజకీయ పరిస్థితులను సీఎంకు వివరించారు.

భారీ ర్యాలీతో నర్సరావుపేటకు..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎన్టీఆర్ నగర్ జాతీయ రహదారిపై ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్ నుంచి నర్సరావుపేటకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నర్సరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్‌యాదవ్ భారీ ర్యాలీతో బుధవారం బయల్దేరారు. నగరంలోని కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): ఏఆర్ డీఎస్పీగా వెంకటేశ్వరరావు బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ సౌజన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు 1992లో పోలీస్ శాఖలో ఆర్ఎస్సైగా విధుల్లో చేరారు. విజయవాడ, జీఆర్పీ, మచిలీపట్నం, ఆక్టోపస్‌తో పాటు వివిధ విభాగాల్లో పనిచేశారు. ఒంగోలు ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా నియమితులయ్యారు.

వలంటీర్లకు నేటి నుంచి సన్మానాలు

నెల్లూరు(పొగతోట): సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరిట వలంటీర్లకు సన్మాన కార్యక్రమాలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ఆయా మండలాల్లో వలంటీర్లను ఎమ్మెల్యేలు సత్కరించనున్నారు. 41 మంది వలంటీర్లకు సేవా వజ్ర, 225 మందికి సేవా రత్న, 12517 మందిని సేవా మిత్ర ద్వారా సత్కరించనున్నారు.



లబ్ధిదారులకు నమూనా తాళాన్ని అందజేస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు



భారీగా హాజరైన లబ్ధిదారులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం

ఆనందం.. అంబరాన్నంటి

మామిడి తోరణాలు.. బంధుమిత్రుల కోలాహలం.. పూజా కార్యక్రమాలు.. పండగ వాతావరణం నడుమ టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. సొంతింటి కల ఎప్పటికి నెరవేరుతుందోననే అనుమానం.. అద్దె ఇళ్లలో ఉంటూ ఆ భారాన్ని మోయలేక అవస్థలు పడుతున్న ఎంతో మంది చిరకాల స్వప్నం ప్రభుత్వ పుణ్యమానని సాకారమైంది. తమకు గృహయోగం కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య పేర్కొన్నారు.

- పేదల కలల సౌధం సాకారం
- 15 వేల టిడ్కో గృహాల అందజేత
- పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- ఖుషీఖుషీగా లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేదలకు సొంతిల్లు ఉండాలనే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ఇప్పటికే జగనన్న కాలనీల్లో గృహాలను నిర్మిస్తుండగా.. తాజాగా టిడ్కో ద్వారా పూర్తయిన గృహ సముదాయాలను లబ్ధిదారులకు మంగళవారం అప్పగించింది. జిల్లాలో ఒక్క రోజులోనే 15,552 గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. 300 చదరపు అడుగుల ఇళ్లను 15,120 మందికి.. 365 చదరపు అడుగుల గృహాలను 432 మంది లబ్ధిదారులకు కేటాయించారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ప్రజాప్రతినిధుల సమక్షంలో అల్లీపురంలో కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు.

ఆద్యంతం.. కోలాహలం

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల్లో ప్రవేశాలను అట్టహాసంగా నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, కల్లూరుపల్లి, కొండ్లపూడి, ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపాన, అక్కచెరువుపాడు ప్రాంతాల్లో రెండు విడతల్లో నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు కేటాయించారు. లబ్ధిదారులకు తమ సొంతింటి తాళాలతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసి గృహప్రవేశాలు చేయించారు. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సమక్షంలో ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



నెల్లూరు(బారకాసు): తమ సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కరతాళధ్వనులతో కృతజ్ఞతలను తెలియజేశారు. అల్లీపురంలో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

ఘన స్వాగతం

కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులకు ఘన స్వాగతం పలికారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, ఎమ్మెస్మీఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, నేతలు పాట్లూరి జయవర్ధన్, మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి, పాలకీర్తి రవికుమార్, టిడ్కో ఎండీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు



పసుపు, కుంకుమతో గడపను తీర్చిదిద్దుతూ..

సొంతింటి కల నెరవేరింది



ఉస్మాన్‌సాహెబ్‌పేటలో 17 ఏళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటున్నా. నా భర్త తొమ్మిదేళ్ల క్రితం మరణించారు. ప్రైవేట్ షాపులో పనిచేస్తూ వారిచ్చే జీతంతో కుమారుడ్ని చదివించుకుంటున్నా. గత ప్రభుత్వంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. మంజూరైనా ఇల్లు ఇవ్వలేదు. అధికారులు, టీడీపీ నేతల చుట్టూ తిరిగినా ప్రయోజనం లభించలేదు. అల్లీపురంలో నిర్మించిన టిడ్కో ఇంటిని ప్రస్తుత ప్రభుత్వం అందజేయడంతో నా కల సాకారమైంది.

– శ్రీరామ్ సౌమ్య, లబ్ధిదారు

చాలా సంతోషంగా ఉంది



నగరంలోని కామాటి వీధిలో బాడుగ ఇంట్లో 15 ఏళ్లుగా ఉంటున్నాం. సొంతింటి కోసం ఏడేళ్ల క్రితం తల్లి పేరుపై దరఖాస్తు చేసుకున్నాం. అనేకసార్లు ఇంటి కోసం తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో ఆశలు వదులుకున్నాం. 85 ఏళ్ల వయస్సున్న నా తల్లికి ఆరోగ్యం బాగాలేకుండా వచ్చింది. ప్రస్తుతం అన్ని వసతులతో ఇల్లు రావడం ఆనందాన్ని కలిగించింది.

– కొండపల్లి విజయ్, లబ్ధిదారు కుమారుడు

ఇల్లు వస్తుందని ఊహించలేదు



నేను, నా భర్త కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ఆరేళ్లుగా లక్ష్మీనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇంటి బాడుగ, ఖర్చులు, పిల్లల చదువులకు మా సంపాదన సరిపోయేది కాదు. ఇల్లు పొందాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా. దీనిపై పలుమార్లు అధికారులను అడిగినా సరైన సమాధానం లేకపోవడంతో ఆశలు వదిలేసుకున్నాం. జగనన్న ప్రభుత్వంలో మా కల నెరవేరడం సంతోషంగా ఉంది.

– రాయపు కరుణ, లబ్ధిదారు

జగన్‌బాబు కారణంగా ఇల్లు వచ్చింది

నేను, నా భర్త మైపాడు రోడ్డులో బాడుగ ఇంట్లో ఉంటూ టిఫిన్ అంగడి ద్వారా జీవనం సాగించేవాళ్లం. మా కుమారుడు చనిపోయారు. కూతురికి వివాహమై పొదలకూరులో ఉంటున్నారు. పదేళ్ల క్రితం కింద పడటంతో కాలు విరిగింది. ఆపరేషన్ చేసినా, నడవడం చాలా కష్టంగా ఉంటోంది. గతంలో ఇంటి కోసం పెట్టుకున్న అర్జీ విషయమై అధికారుల చుట్టూ నా అల్లుడు తిరిగేవారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా సొంతిల్లు వచ్చింది.



– అడిగోపుల సరోజనమ్మ, లబ్ధిదారు

గ్లాసు కోసం కీచులాట

- **జనసేనలో నేతల మధ్య పోరు తారస్థాయికి**
- వర్గాలుగా విడిపోయి ప్రచారాలు
- టికెట్ మాదేనంటూ ఎవరికి వారు ప్రచారం

జిల్లాలో ఉనికే అంతంతమాత్రం.. ఆపై నేతల మధ్య తారస్థాయికి చేరిన వర్గపోరు.. టికెట్ తమకేనంటూ ఎవరికి వారి ప్రచారం.. ఇలా జనసేనలో లుకలుకలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిణామాలతో డీలా పడిపోవడం ఆ పార్టీ కార్యకర్తల వంతవుతోంది. ఈ కీచులాటలను సాకుగా చూపి ఆ పార్టీలో విభేదాలను మరింత రాజేసి పొత్తులో సీటు దక్కకుండా అడ్డుకునేందుకు టీడీపీ నేతలు తమ యత్నాలను ముమ్మరం చేశారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో జనసేన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసలు బలమే అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీకి నేతల మధ్య వర్గ పోరు తలనొప్పిగా మారింది. పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా వ్యవహరిస్తున్నారు.

విభేదాలను రాజేయడమే లక్ష్యంగా..

వాస్తవానికి టీడీపీతో పొత్తు నేపథ్యంలో జనసేనకు జిల్లాలో ఒక సీటు ఇస్తారనే ప్రచారం ఉంది. అయితే ఆ సీటు ఏదో తెలియకపోయినా, తమకు దక్కాలంటే తమకే దక్కాలంటూ ఆ పార్టీ నేతలు వర్గాలుగా విడిపోయి ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విభేదాలను బూచిగా చూపి అసలు జనసేనకే టికెట్ దక్కకుండా చేసేందుకు టీడీపీ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

చోటా నేతలే కీలకంగా చెలామణి

జనసేన ఆవిర్భావం నుంచే ఆ పార్టీకి జిల్లాలో జనాకర్షణ గల నేతలు ఎవరూ లేరు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్, చిరంజీవి అభిమాన సంఘ నేతలతో పాటు ముఖపరిచయం లేని చోటా నేతలే జిల్లాలో కీలక నేతలుగా చెలామణి అవుతున్నారు.

- కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో ఉన్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి జనసేనలో చేరి పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కొంత చొరవ చూపారు. అయితే ఆ పార్టీలో సరైన ప్రాధాన్యం దక్కకుండా పార్టీలోని కీలక నేతే అడ్డుపడ్డారు. దీంతో ఆయన పార్టీ మారాల్సి వచ్చింది.
- జిల్లాలో పార్టీని మనుక్రాంత్‌రెడ్డి ప్రస్తుతం నడిపిస్తున్నారు. పార్టీని నమ్ముకొని కొంత చేతి చమురును వదిలించుకున్నా, ఆయనకు అవమానాలే ఎదురవుతున్నాయి. జనసేనలో కీలకనేతగా ఉన్న నాదెండ్ల మనోహర్‌తో సత్సంబంధాలున్నా, జిల్లాలో అతనికి వ్యతిరేక కూటమిగా మరో వర్గం ఏర్పడింది.

జనసేనలో టీడీపీ కోవర్టు

మాజీ మంత్రి నారాయణ కోవర్టుగా జనసేనలో ఓ చోటా నేత ఉన్నారని ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ రాష్ట్రస్థాయి నేత వేములపాటి అజయ్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన సదరు నేత.. మనుక్రాంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మరి కొందర్ని కలుపుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నారాయణ శిబిరానికి సంబంధించిన వ్యక్తి కావడంతో ఆయనకు నెలవారీ జీతంతో పాటు ఖరీదైన వాహనాన్నీ సమకూర్చారని సమాచారం. ఆయన్ను పావుగా వాడుకొని మనుక్రాంత్‌కు వ్యతిరేకంగా పనిచేయిస్తూ నెల్లూరు సిటీ సీటు విషయంలో పేచీ పెట్టించి తప్పించాలనేదే నారాయణ కుట్ర కోణం. ఆ దిశగానే సదరు కోవర్టు పనిచేయడం ప్రారంభించారు.

పథకం ప్రకారం రంగంలోకి జానీ మాస్టర్

నెల్లూరుకు చెందిన సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను ఓ పథకం ప్రకారం రంగంలోకి దింపారు. ఆయనతో నగరంలో పలు కార్యక్రమాలను నిర్వహించేలా చేశారు. పవన్‌కల్యాణ్ ఆదేశిస్తే నెల్లూరు నుంచి పోటీ చేస్తానంటూ ప్రకటనా చేయించారు. నెల్లూరులోనే ఎక్కువ సమయాన్ని ఆయన కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. కాగా టోనీ అనే వ్యక్తి సైతం పవన్ కల్యాణ్ అభిమాన నేతనంటూ నగరంలో హడావుడి చేస్తున్నారు. ఈ పరిణామాలతో జనసేనలో ఏమి జరుగుతోందో అర్థం కాక పవన్ అభిమానులు తలలు పట్టుకుంటున్నారు.



నగరంలో పోటాపోటీ కార్యక్రమాలు

జిల్లాలో జనసేన ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి లేదు. పొత్తుల్లోనైనా పోటీకి అవకాశం ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆశపడ్డారు. ఈ క్రమంలో ఈ ఎన్నికల్లో జనసేనతో టీడీపీ దోస్తీ కుదరడంతో వారిలో ఆశలు చిగురించాయి. నెల్లూరు సిటీ లేదా రూరల్‌లో ఏదో ఒక చోట అవకాశం రావొచ్చని ఎన్నికల ప్రచారాన్ని మనుక్రాంత్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. ప్రధానంగా నెల్లూరు సిటీపైనే ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆయన వ్యతిరేక వర్గం సైతం తమకే సీటు వస్తుందని ప్రచారం చేసుకుంటోంది. ఈ క్రమంలో నగరంలో పోటాపోటీగా కార్యక్రమాలను సాగిస్తుండటం చర్చనీయాంశమైంది.

కర్షకుల సేవలో చినపవని క్షేత్రం

లింగసముద్రం మండలంలోని చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం రైతుల సేవలో తరిస్తోంది. అన్నదాతలకు ఉపయోగపడే వివిధ రకాల వంగడాలకు రూపకల్పన చేస్తూ కర్షకులకు ఉపయుక్తంగా ఉంటోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో క్షేత్రం అభివృద్ధికి చర్యలు చేపట్టింది. క్షేత్రంలో పనిచేసే శాస్త్రవేత్తలు మేలైన విత్తనాల ఉత్పత్తే లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

- విత్తనాభివృద్ధికి నిరంతర కృషి
- అందుబాటులో శాస్త్రవేత్తలు, సిబ్బంది
- మేలైన విత్తనాల ఉత్పత్తే లక్ష్యం
- వందల ఎకరాల్లో అపరాల సాగు



చినపవని క్షేత్రంలో సాగుచేసిన మినుము పంట

సాక్షి, నెల్లూరు డెస్క్: చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం మేలురకం వంగడాల తయారీలో పురోగతిలో సాగుతోంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చినపవని వద్ద ఉన్న వ్యవసాయ భూముల్లో విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. ఆ భూముల్లోని 410.30 ఎకరాలను దీని కోసం 2021లో కేటాయించింది. మొదట్లో ఎలాంటి వసతుల్లేని ఆ ప్రాంతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాధికారులు శ్రమించి భూములను పంటల సాగుకు అనుకూలంగా మార్చి వివిధ రకాల విత్తనాలను అభివృద్ధి చేస్తున్నారు.

లక్ష్యం ఏమిటంటే..

ప్రధానంగా ఈ క్షేత్రంలో అపరాల పంటలైన మినుము, కంది, పెసర, శనగ వంటి వాటితో పాటు రాగులు, సజ్జలు, కొర్రలు, వరిగలు, ఊదలు, సామలు వంటి చిరుధాన్యాలపై కూడా పరిశోధన చేసి మేలు రకం విత్తనాలను రైతులకు సరఫరా చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ యూనివర్సిటీలు, ప్రైవేట్ పరిశోధన కేంద్రాల్లో కనుగొన్న నూతన వంగడాలను ఇక్కడ సాగు చేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తల నియామకం అనంతరం ఇక్కడ కొత్తరకం



విత్తనాలపై పరిశోధనలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం మినుము, కంది, పెసర వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన మేలు రకం మినుము విత్తనాలు వంద క్వింటాళ్లు.. ఐదు క్వింటాళ్ల పెసర విత్తనాలను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సరఫరా చేశారు.

సాగు ఇలా..

విత్తనాభివృద్ధి కేంద్రంలో పంటలు ఏపుగా పెరిగేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. గతేడాది భూసారం పెంచేందుకు 200 ఎకరాల్లో జనుము పంట, 50 ఎకరాల్లో టీబీజీ–104 రకం మినుము పంట, 50 ఎకరాల్లో వైఎల్ఎం 66 రకం నువ్వు పంటను సాగు చేశారు. రైతులకు అధిక దిగుబడినిచ్చే మేలైన విత్తనాలను అందించేందుకు గానూ గతేడాది రబీలో 250 ఎకరాల్లో జనుము, టీబీజీ 104 రకం మినుము, ఐపీఎం 2 – 14 రకం పెసర, వైఎల్ఎం 66 రకం నువ్వుల పంటలను సాగు చేశారు. ఆర్కేవీవై రాఫ్టర్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన నిధులతో కేంద్రంలో వివిధ పనులు చేపట్టారు. వ్యవసాయ సిబ్బందికి అవసరమైన శిక్షణ, ఆఫీస్ బిల్డింగ్, గోదాము, త్రెషింగ్ ఫ్లోర్, భూముల చుట్టూ ఫెన్సింగ్ వంటి పనులు చేశారు. పంట కాలువలు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

ఇక్కడ పండించిన మేలు రకం విత్తనాలు రైతులకు అందజేస్తున్నాం. మినుము విత్తనాలు 100 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 5 క్వింటాళ్లను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సరఫరా చేశాం. ఈ ఏడాది 300 ఎకరాల్లో పంటలు సాగు చేసి విత్తనాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. మినుము 25 ఎకరాలు, కంది 10 ఎకరాలు, పెసర 25 ఎకరాలు ఇలా అన్ని రకాల అపరాల సాగుకు సిద్ధమవుతున్నాం. తదుపరి దశలో చిరుధాన్యాల సాగునూ ప్రారంభించి విత్తనాలు అభివృద్ధి చేస్తాం. కొత్త రకం హైబ్రీడ్ వెదురు సాగును 15 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టాం. ఇది పిలకలు తక్కువగా ఉండి గుబురుగా కాకుండా ఎత్తుగా పెరుగుతుంది. ఐదేళ్లలోనే నాణ్యమైన కర్ర దిగుబడి వస్తుంది. ఇలాంటి వెదురును సాగు చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం వస్తుంది. వెదురును కావాల్సిన రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– నవీన్, శాస్త్రవేత్త, విత్తనాభివృద్ధి క్షేత్రం

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు అధికారులు అన్ని జాగ్రత్తలతో దరఖాస్తులను పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఫారం – 6పై జనవరి 23 నుంచి ఇప్పటి వరకు 13,573 దరఖాస్తులు రాగా, 2750ను ఆమోదించామని, 686ను తిరస్కరించామని, 10,137 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఫారం – 7 10,647, ఫారం – 8ను 6537 మేర పరిష్కరించాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సీ నారాయణ, టీడీపీ నేతలు నారాయణ, భువనేశ్వరిప్రసాద్, రసూల్, కాంగ్రెస్ నేత బాలసుధాకర్, ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కే ప్రజల ఆశీస్సులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: 'ఎవరు ఎన్ని కుట్రలు చేసినా దేవుడి అండ, ప్రజల ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు పట్టం కట్టేందుకు ఓటరు సిద్ధంగా ఉన్నారు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని భద్రాచలం గ్రామంలో ఉన్న పాత సినిమా హాల్ ప్రాంగణంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా పెద్దపీట వేశారన్నారు. సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలుస్తుందని చెబుతున్నాయన్నారు. అలా అని వదిలేయకుండా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీలు జగన్, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వాటిని ఖండిస్తూ 2019 నుంచి చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లడిగే పరిస్థితి లేదన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డిపై బురద వేస్తున్నాడని విమర్శించారు. బాబు, పవన్ చేతిలో షర్మిల కీలుబొమ్మగా మారారన్నారు. దివంగత వైఎస్సార్ పేరు చార్జ్‌షీట్‌లో చేర్చి, జగన్‌ను 16 నెలలు జైల్లో పెట్టిన పార్టీతో ఆమె చేతులు కలిపారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, వైస్ ఎంపీపీలు ఆవుల శ్రీనివాసులు, సౌందర్య, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, కొండూరి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంలో బుధవారం విజయీభవ యాత్ర జరిగింది. ఇందులో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం 600 హామీలిచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన గత టీడీపీ ప్రభుత్వానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం హామీలు నెరవేర్చిన జగనన్న ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ అక్కసు వెళ్లగక్కుతోందన్నారు. గత ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేసి బాగు చేసిందన్నారు. పేదలకు వైద్యసేవలందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ప్రజలకు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంట మరోసారి నడిచేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, నాయకుడు ఊరిబిండి ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ పెయ్యాల సంపూర్ణ, స్థానిక సర్పంచ్ శోభ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాం



ఉదయగిరి సినిమా హాల్ సెంటర్‌లో పర్యటిస్తున్న మేకపాటి, నాయకులు

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: 'సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాం. ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలోని ఇందిరానగర్, ఎస్సీ కాలనీ, సినిమాహాల్ సెంటర్లలో బుధవారం రాజగోపాల్‌రెడ్డి పర్యటించారు. రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో రాజగోపాల్‌రెడ్డికి పార్టీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మండల ఉపాధ్యక్షురాలు శాంతి ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం మేకపాటి మాట్లాడుతూ పథకాల వల్ల ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును రాష్ట్రానికి పట్టిన అరిష్టంగా అభివర్ణించారు. ఎన్నిక వేళ ఆయన అబద్ధపు హామీలతో వస్తున్నాడని, ఎవరూ నమ్మొద్దని కోరారు. బాబుకు ఓటు వేస్తే ప్రస్తుత సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ప్రతి ఓటరు ఆలోచించి సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత అయిన జగన్ పక్షాన నిలబడాలని కోరారు. అంతకుముందు స్థానిక ఆంజనేయస్వామి గుడిలో ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోదీ వీరాంజనేయులు, ఎంపీటీసీలు గొల్లపల్లి తిరుపతి, నేతలు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి కె.కృష్ణారెడ్డి, మట్ల లక్ష్మయ్య, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'దామోదరం' సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న వెంకటయ్య

నెల్లూరు(వేదాయపాళెం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్య పేదలకు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నెల్లూరు దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో సాంఘిక, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ సంజీవయ్య కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రిగా పని చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో సీఎంగా ఉన్నారన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి రమేష్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా రాణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి హేనాసుజన్, గిరిజన సంక్షేమాధికారిణి పరిమళ, నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కాసులపేరు అప్పగింత



కాసులపేరు అందజేస్తున్న దృశ్యం

సంగం: మండలంలోని వంగల్లు గ్రామంలో భీమేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల మాయమైన బంగారు కాసులపేరును గత ఈఓ రమేష్‌రెడ్డి బుధవారం ఆలయ అధికారులకు అప్పగించారు. కాసులపేరు మాయమవడంతో ఆలయ చైర్మన్ రఘురామయ్య ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. రమేష్‌రెడ్డి పదవిలో ఉన్నప్పుడు ఇది మాయమైనట్లు గుర్తించారు. దీంతో ఆయన రూ.6 లక్షల విలువైన నూతన కాసులపేరును తయారు చేయించి అప్పగించారు. అధికారులు రికార్డుల్లో నమోదు చేసిన అనంతరం చైర్మన్‌కు అందజేశారు. వంగల్లు జరిగిన ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈఓ వరప్రసాద్, అర్చకులు కిశోర్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): కళాశాలకు అని వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. హరనాథపురానికి చెందిన యువతి నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం యువతిని ఆమె అక్క స్కూటీలో కళాశాల వద్ద వదిలి వెళ్లింది. అక్కడి నుంచి యువతి అదృశ్యమైంది. ఆమె కళాశాలకు రాలేదని తల్లిదండ్రులకు సిబ్బంది ఫోన్ చేసి చెప్పారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించారు. జాడ తెలియరాకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 242
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 145



ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండండి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులంతా సంసిద్ధంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో బుధవారం పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని, అందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్స్, గత ఎన్నికల కేసుల్లోని వారి బైండోవర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్నా, అత్యుత్సాహం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, ప్రాసిక్యూషన్ విచారణపై ప్రత్యేక శ్రద్ధ చూపి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానంపై దృష్టి సారించడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చన్నారు. అనంతరం పెండింగ్ కేసులపై సమీక్షించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గతనెలలో కేసుల ఛేదన, నిందితుల అరెస్ట్, కేసుల పెండెన్సీ తగ్గింపు తదితరాల్లో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

- వృద్ధుడిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైమ్): బాలిక పట్ల ఓ వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో మస్తాన్ అనే వృద్ధుడు ఒంటరిగా ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయన అదే ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారించి పోక్సో కేసు నమోదు చేశారు.

జోయాలుక్కాస్ రెండో షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న నటి మిర్నా

నెల్లూరు(బృందావనం): జోయాలుక్కాస్ రెండో షోరూంను నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో ఉన్న గోమతినగర్‌లో బుధవారం సినీ నటి మిర్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యువెలరీ రంగంలో పేరున్న జోయాలుక్కాస్ షోరూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నో డిజైన్లతో ఆభరణాలు కస్టమర్లకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జోయ్ ఆలుక్కాస్ మాట్లాడుతూ గ్రూప్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా రెండో షోరూంను మొదలుపెట్టామన్నారు. నెల్లూరు తమకు ఎంతో విజయవంతమైన ప్రదేశమన్నారు. ఇక్కడి ప్రజలకు ప్రపంచ స్థాయి జ్యువెలరీ అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రారంభ ఆఫర్‌గా మజూరీ చార్జీలపై తాము 50 శాతం తగ్గింపు అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ ఈనెల 25వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఇటీవల సాయినందన్ అనే యువకుడిని కిడ్నాప్ చేసిన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కిడ్నాప్‌కు పాల్పడిన లేక్‌వ్యూ కాలనీకి చెందిన వంశీకుమార్, అతని స్నేహితులైన వి.సత్రం మండలం కనుపూరుకు చెందిన క్రాంతివర్మ, వినోద్, మనుబోలుకు చెందిన శ్రీకాంత్‌ను బుధవారం పెన్నా బ్రిడ్జి సమీపంలో ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు అరెస్ట్ చేశారు. వారి నుంచి నేరానికి ఉపయోగించిన కారుతోపాటు రెండు కత్తులు, కర్రలను స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృత్యువాత

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని డ్రైవర్స్ కాలనీకి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ ఎస్.సుబ్రహ్మణ్యం (75), సుశీలమ్మ దంపతులకు మధుబాబు, ప్రసన్నలక్ష్మి, భారతి, రేవతి సంతానం. వారికి వివాహాలయ్యాయి. ఉద్యోగం నుంచి రిటైర్ట్ అయ్యాక సుబ్రహ్మణ్యం కొడవలూరులోని ఓ ప్రైవేట్ కళాశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధాప్యం వల్ల నాలుగు నెలలుగా పనిమానేశాడు. కొంతకాలంగా ఆయన బీపీ, మూత్రసంబంధిత వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. ఈక్రమంలో ఈనెల ఒకటో తేదీన సుశీలమ్మ నాయుడుపేటలోని చెల్లెలు రాజమ్మ ఇంటికి వెళ్లింది. సుబ్రహ్మణ్యం ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఆరోగ్యం విషయంలో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల ఏడో తేదీన గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడు పాపయ్యకు చెప్పాడు. ఆయన బాధిత కుటుంబసభ్యులకు తెలియజేశాడు. కుటుంబసభ్యులు ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న సుబ్రహ్మణ్యంను జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈమేరకు సుశీలమ్మ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ

మనుబోలు: ఆయుర్వేద వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజాతి సూచించారు. మండలంలోని మడమనూరులో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదంలో అన్ని రకాల వ్యాధులకు మందులు ఉన్నాయన్నారు. కొత్తగా 33 రకాల మందులను ఆస్పత్రికి పంపించినట్లు తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్‌కు అవకాశం లేదన్నారు. మొండి రోగాలకు సైతం చికిత్సా విధానాలు ఉన్నాయన్నారు. వైద్యాధికారి జగదీశ్వరితో మాట్లాడి రోగుల రాక, మందులు తదితర వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి



ట్రాక్టర్ టైరు కింద గురవయ్య మృతదేహం

ఉదయగిరి: ట్రాక్టర్ టైరు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. బద్వేలు పట్టణం గౌరీశంకర్‌నగర్‌కు చెందిన తుపాకుల గురవయ్య (45) బేల్దారి పనులు చేస్తుంటాడు. దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామంలో ఇంటి నిర్మాణ పనులకు వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ జిల్లా బి.కోడూరుకు చెందిన కానుగ సుందరం, పోరుమామిళ్లకు చెందిన శెట్టి రవి, గురవయ్య కలిసి ట్రాక్టర్‌లో ఉదయగిరికి వచ్చారు. మద్యం తాగి వెంకటంపేటకు బయలుదేరారు. సుందరం ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో బీసీ కాలనీ సమీపంలో వాహనం అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ పక్కన కూర్చొన్న గురవయ్య కిందపడ్డాడు. అతడిపైకి ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారు వాహనాన్ని వదిలి వెంకటంపేట వెళ్లిపోయారు. మేస్త్రి వారిని గురవయ్య విషయమై ప్రశ్నించాడు. సరైన సమాధానం రాకపోవడంతో దుత్తలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అడిగినా వారి నుంచి సమాధానం రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం గురవయ్య మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోవూరులో అగ్ని ప్రమాదం



కాలిపోయిన ఏసీ

కోవూరు: స్థానిక మందబయలు సెంటర్‌లోని ఇండియన్ బ్యాంక్ మిద్దెపైన శ్రీరాములు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.2 లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని ఏడీఎఫ్ఓ వేణుగోపాలరావు వెల్లడించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.34



ఆధార్ కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ

నెల్లూరు(పొగతోట): సచివాలయాల్లోని ఆధార్ కంప్యూటర్ ఆపరేటర్లకు వివిధ అంశాలపై ఈనెల 15వ తేదీన శిక్షణ ఇస్తామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆపరేటర్లందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.